క్లుప్తంగా

అయ్యప్ప మాలధారులకు అల్పాహారం పంపిణీ


ఆలయంలో అయ్యప్ప మాలధారులకు అల్పాహారం ఏర్పాటు చేసిన ముస్లింలు

నల్లజర్ల: భారతదేశం విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలకు నిలయం. హిందూ, ముస్లింలు భాయ్.. భాయ్ అంటూ ఒకరి మతాన్ని మరొకరు గౌరవిస్తూ ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారు. రంజాన్ మాసంలో ముస్లింలకు హిందువులు ఇఫ్తార్ విందులు ఇస్తుండగా ప్రస్తుతం అయ్యప్ప దీక్షాధారులకు ముస్లింలు అల్పాహారం అందిస్తున్నారు. శుక్రవారం ముస్లింలకు ప్రీతిపాత్రమైన రోజు. అనంతపల్లిలోని మదనగోపాలస్వామి ఆలయంలో దాదాపు 150 మంది అయ్యప్ప మాలధారులకు ముస్లింలు షేక్ అక్బర్, షేక్ బాజీ, సయ్యద్ బషీర్, సయ్యద్ బాజీలు అల్పాహారం ఏర్పాటు చేసి సోదరభావం చాటుకున్నారు.

నేడు, రేపు ఓటర్ల నమోదు కార్యక్రమం

నల్లజర్ల: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 4, 5 తేదీలలో బూత్ స్థాయిలో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ కిశోర్‌కుమార్ తెలిపారు. ఓటరు జాబితాలో సవరణలు, చేర్పులు, మార్పులపై దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ బీఎల్వోలకు నేరుగా దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు.

నిడదవోలు రూరల్: నియోజకవర్గంలోని 205 పోలింగ్ కేంద్రాల్లో ఈ నెల 4, 5 తేదీల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ ఎం.గంగరాజు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద శని, ఆదివారాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటర్ల నమోదు, తొలగింపు, సవరణ, ఆధార్ డేటాను ఓటర్ ఐడీ కార్డుతో అనుసంధానం చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని 58 పోలింగ్ కేంద్రాల పరిధిలో శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ జి.కనకరాజు తెలిపారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వ్యక్తి మృతి

ఉండ్రాజవరం: కాల్దారీ గ్రామానికి చెందిన కలసిపూడి చిట్టిబాబు (43) గురువారం రాత్రి గుండెపోటుతో మరణించినట్లు అతని భార్య సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.రామారావు శుక్రవారం రాత్రి తెలిపారు. చిట్టిబాబుతో మనస్పర్థల కారణంగా మూడేళ్లుగా సత్యవతి, ముగ్గురు పిల్లలూ దూరంగా ఉంటున్నారు. అయితే గురువారం రాత్రి చిట్టిబాబు చికెన్ పకోడి వ్యాపారం ముగించుకుని ఇంటికి వెళ్లి నిద్రించాడు. శుక్రవారం ఉదయం అతని మేనమామ చంద్రయ్య చూసేసరికి మృతి చెందాడు. అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దుర్గమ్మ సన్నిధిలో అన్నసమారాధన


కనకదుర్గమ్మ ఆలయం వద్ద అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

పెరవలి: దేవీ నవరాత్రుల ముగింపు సందర్భంగా ఖండవల్లి కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. ఖండవల్లి, లంకమాలపల్లి, ముక్కామల, అన్నవరప్పాడు తదితర గ్రామాలకు చెందిన సుమారు 16 వేల మంది భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అన్నసమారాధనలో 10 రకాల ఆహార పదార్థాలను భక్తులకు వడ్డించారు. నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జలవనరుల గణనపై శిక్షణ


తాళ్లపూడి తహసీల్దార్ కార్యాలయంలో జలవనరుల గణనపై అవగాహన కార్యక్రమం

తాళ్లపూడి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జలవనరుల గణనపై శుక్రవారం గ్రామ రెవెన్యూ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ టి.రాధిక మాట్లాడుతూ గ్రామాల్లో నీటి వనరుల లభ్యతను గణన చేయాలన్నారు. ప్రోగ్రాం కన్వీనర్, ఏఎస్ఓ జె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి గ్రామంలోని చెరువులు, ఊట చెరువులు, చెక్ డ్యామ్‌లు, జలాశయాలు అన్నింటినీ గణన చేయాలన్నారు. 16 రకాల ప్రశ్నలతో ఈ సర్వే జరుగుతుందన్నారు. వ్యక్తిగత, నీటిపారుదల, పారిశ్రామిక, మత్స్య ఉత్పత్తి, గృహ సంబంధ, తాగునీటి, వినోద, మతపరమైన, భూగర్భ జలాలను పెంచడం, ఇతరత్రా అవసరాలకు ఉపయోగిస్తున్న తీరు పరిశీలించాలన్నారు. గ్రామ రెవెన్యూ అధికారులు ప్రవీణ్, కావూరి నాగేశ్వరరావు, సుజాత, సంజీవరావు, నరేష్, లీలావతి తదితరులు పాల్గొన్నారు.


సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు (ఫైల్)


జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

ఇక ఆరోగ్యానికి సురక్ష

- 'జగనన్న ఆరోగ్య సురక్ష'తో పేదలకు మేలు
- వైద్య శిబిరాలకు అనూహ్య స్పందన
- నియోజకవర్గంలో 30,707 మందికి సేవలు

నిడదవోలు: పేదలకూ కార్పొరేట్ వైద్య సేవలు అందుతున్నాయి.. సీఎం జగనన్న సంకల్పంతో ఇంటి ముంగిటకే సేవలు వస్తున్నాయి.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు సంజీవినిలా మారింది. అందరికీ ఉచిత వైద్యాన్ని అందజేయాలనే మంచి ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోంది. నియోజకవర్గంలో నిడదవోలు మున్సిపాలిటీతో పాటు నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండలాలకు సంబంధించి ఇప్పటి వరకూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల్లో 69 వైద్య శిబిరాలు నిర్వహించారు. ఇందులో సుమారు 30,707 మందికి పైగా ఉచిత వైద్య సేవలు పొందారు. 1,367 మందికి మెరుగైన సేవల నిమిత్తం ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ ఆసుపత్రులకు సిఫార్సు చేశారు. ముందుగా ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిపై గత నెల సెప్టెంబర్ 16 నుంచి సర్వే చేశారు. వలంటీర్ల ద్వారా వారి పరిధిలో 50 ఇళ్లలో ఏఎన్ఎం, ఆశ కార్యకర్త టీంగా వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అంతేకాకుండా షుగర్, బీపీ, రక్త పరీక్షలు నిర్వహించి వైద్య శిబిరానికి రావాలని టోకెన్లు అందజేశారు.

సురక్ష సేవలు ఇలా..

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ముందుగా శిబిరంలోని హెల్ప్‌డెస్క్‌లో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయించుకుని కేస్ సీటు ద్వారా సంబంధిత వైద్యులను కలిసే సదుపాయం కల్పించారు. అన్ని విభాగాల వైద్యులను అందుబాటులో ఉన్నారు. ఉచితంగా మందులు ఇవ్వడమే కాకుండా మెరుగైన వైద్య సేవలకు, శస్త్రచికిత్సలకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ ఆసుపత్రులకు సిఫార్సు చేశారు. కంటి పరీక్షలు చేసి కళ్లజోళ్లు ఇవ్వడంతో పాటు అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేయిస్తున్నారు.

ఆరోగ్య సమాచారం నిక్షిప్తం

ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో వైద్యం పొందిన రోగుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. రోగి పేరు, సమస్య, అందుకు కారణాలు, గతంలో పొందిన వైద్య సహాయం వంటి వివరాలను పొందుపరుస్తున్నారు. రోగి ఆరోగ్య సమాచారం పూర్తిస్థాయిలో భద్రపరిచి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన కార్యాచరణను వైద్య ఆరోగ్యశాఖ చేపట్టింది.

ఎంతో మందికి సేవలు



నిడదవోలులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఎంతో మందికి వైద్య సేవలు అందించాం. చాలామంది దీర్ఘకాలిక సమస్యలతో శిబిరానికి వచ్చారు. అటువంటి వారికి ఎంతో ఉపయోగకర సేవలు అందాయి. చాలామందికి ఆరోగ్యశ్రీ పథకంపై అవగాహన కల్పించాం. ఈ కార్యక్రమంలో సేవలు అందించడం సంతృప్తిగా ఉంది.

– ఇ.తేజశ్రీ, డాక్టర్ నెహ్రూనగర్ అర్బన్‌హెల్త్ సెంటర్, నిడదవోలు

సీఎంకు రుణపడి ఉంటాం..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చాలా బాగుంది. శిబిరంలో షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి ఈసీజీ కూడా తీశారు. ప్రజల వద్దకే వైద్యులను తీసుకురావడమే కాకుండా ఉచితంగా మందులు ఇచ్చి పంపించారు. కంటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న నాకు పరీక్షలు చేశారు. సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం.

– తామరపు సత్యవతి, నెహ్రూనగర్, నిడదవోలు

జాగ్రత్తలు వివరించి..



అన్నిరకాల వ్యాధులకూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య సహాయం అందుతోంది. వైద్యులు ఎంతో ఓర్పుతో పరీక్షించి వైద్య సేవలు అందిస్తూ ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నారు. మందులు కూడా పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచారు. ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు.

– దాసంశెట్టి నాగలక్ష్మి, నెహ్రూనగర్, నిడదవోలు

అందరికీ తాగునీరు అందించడమే లక్ష్యం


కానూరులో ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

పెరవలి: నియోజకవర్గంలో అందరికీ తాగునీరు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, ప్రతి గ్రామంలో వాటర్ ట్యాంకుల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు తెలిపారు. శుక్రవారం కానూరులో జల్‌జీవన్ మిషన్ పథకంలో రూ.206.80 లక్షలతో వాటర్ ట్యాంక్, పైప్‌లైన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాలో నిడదవోలు నియోజకవర్గం అభివృద్ధిలో ప్రత్యేక స్థానం సాధించిందన్నారు. ప్రతి గ్రామంలో ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటుకు చర్యలు చేపట్టామని, వచ్చే ఏడాదిలోగా ఈ పనులు పూర్తవుతాయన్నారు. ఈ ట్యాంకుల నిర్మాణంతో వచ్చే 25 ఏళ్ల వరకూ ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు తప్పు చేయటంతోనే జైలుకు వెళ్లాల్సి వచ్చిందని, అయినా కల్లబొల్లి మాటలు చెప్పడం సరికాదన్నారు. ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు వీరమల్ల సత్యనారాయణ, సర్పంచ్ భావన మధు పాల్గొన్నారు.

నేడు హోంమంత్రి పర్యటన

కొవ్వూరు: రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత శనివారం ఉదయం పదిన్నర గంటలకు తాడేపల్లిగూడెంలోని జీవీ మాల్ ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. 11 గంటలకు చాగల్లు మండలం నెలటూరులో సీతారామ కల్యాణ మండపంలో ఆంధ్రకు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం మూడున్నర నుంచి చాగల్లు రెండో సచివాలయం పరిధిలో నిర్వహించే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి హాజరవుతారు.

అవినీతి రహిత సమాజానికి కృషి

నల్లజర్ల: అవినీతి రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎల్ఐసీ తాడేపల్లిగూడెం బ్రాంచ్ సీనియర్ మేనేజర్ నున్న సూర్యశ్రీరామ్ అన్నారు. శుక్రవారం విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా అచ్చన్నపాలెంలో గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో అవినీతి లేని సంస్థగా ఎల్ఐసీ వర్ధిల్లుతుందన్నారు. అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ వైవీ రామ్, ఏజెంట్లు పాతూరి సత్యనారాయణ, ముళ్లపూడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు

నిడదవోలు: స్థానిక ప్రభుత్వ బాయ్స్ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న మ్యాథ్స్ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి.మేరీ సుజాత శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెస్సీ మ్యాథ్స్ అర్హత ఉన్న అభ్యర్థులు ఈ నెల 6వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అభివృద్ధిలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా..

ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు


కానూరులో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

పెరవలి: నిడదవోలు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామని, ఇప్పటికే రూ.2 వేల కోట్లతో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. శుక్రవారం కానూరులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఆయన ప్రభుత్వం పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దోచుకో–దాచుకో అన్నట్లు గత టీడీపీ ప్రభుత్వ పాలన సాగిందన్నారు. అప్పట్లో మట్టి, ఇసుకను అడ్డంగా దోచుకున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తుంటే జనసేన, టీడీపీ నాయకులు అనవసర రాద్ధాంతం చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి బాటలు వెన్నిస్తుంటే ప్రతిపక్షాలు అడ్డుకోవడానికి కోర్టుల్లో కేసులు వేస్తున్నాయని అన్నారు. ఈ గ్రామంలో అనేక అభివృద్ధి పనులు, వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు రూ.35 కోట్ల మేర లబ్ధి చేకూరిందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ప్రజలంతా అండగా ఉండాలని కోరారు. ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వీరమల్ల సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కొమ్మిశెట్టి రామాంజనీ, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పాట్టి రాంబాబు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు కొమ్మిశెట్టి రాము, సర్పంచ్ భావన మధు, తోట సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గో సంరక్షణ పోస్టర్ ఆవిష్కరణ

కొవ్వూరు: కర్నూలు పరిసర ప్రాంతాల్లో నదులు, గోవుల పరిరక్షణ కార్యక్రమాలు చేపడుతున్న హిందూ దేవాలయ పరిరక్షణ సమితి సభ్యుడు ఎస్.గోవింద్‌ను పట్టణంలో గోవుల, గౌతమీ, గోదావరి పరిరక్షణ సమితి సభ్యులు సత్కరించారు. శుక్రవారం ఆయన స్థానిక గోష్పాద క్షేత్రానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన చేపట్టే కార్యక్రమాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. పట్టణంలో గోపరిరక్షణకు నియోజకవర్గ టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యుడు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణలు రూ.20 వేల సాయం చేశారు. అనపర్తి గోపాలకృష్ణ, బీజేపీ కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, వైకె శ్రీనివాస్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం రేపు

కొవ్వూరు: పశివేదల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985–86 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఈ నెల 5న నిర్వహించనున్నట్లు ముప్పరాజు శ్రీనివాసరావు తెలిపారు. ఇక్కడి ఎంపీయూపీ స్కూల్ ప్రాంగణంలో నిర్వహించే ఈ సమ్మేళనానికి పూర్వ విద్యార్థులంతా హాజరు కావాలని కోరారు.

దేవాలయాల ప్రగతికి ప్రభుత్వం చర్యలు

ఉండ్రాజవరం: దేవాలయాల ప్రగతికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు తెలిపారు. సూర్యారావుపాలెంలో రజకుల సంఘం ఆధ్వర్యంలో పునర్నిర్మిస్తున్న సంపత్ వినాయకస్వామి ఆలయానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ ఆలయానికి టీటీడీ నుంచి రూ.10 లక్షలను ఎమ్మెల్యే మంజూరు చేయించారు. ఖండవల్లిలో రామాలయం, కాపవరంలో ఆంజనేయస్వామి ఆలయం, పురుషోత్తపల్లిలో అమ్మవారి ఆలయం, విజ్జేశ్వరంలో మహాలక్ష్మి అమ్మవారి ఆలయం, ఉండ్రాజవరంలో గండిపోశమ్మ ఆలయాలకు టీటీడీ నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. రజక సంఘ సభ్యులు మాట్లాడుతూ ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో రూ.6 లక్షలతో ఫిల్టర్ బెడ్ మరమ్మతులు పూర్తవడంతో వాటిని ఎమ్మెల్యే పరిశీలించారు. జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కర రామయ్య, ఎంపీటీసీ సభ్యురాలు పెదప్రోలు వెంకటలక్ష్మి, మండల జేసీఎస్ కన్వీనర్ కఠారి సిద్ధార్థరాజు, నాయకులు పిచ్చుకల వీరరాఘవులు తదితరులు పాల్గొన్నారు.

మీ ఆరోగ్యం.. మా బాధ్యత

- ఆరోగ్య సురక్ష శిబిరాలతో భరోసా
- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు


దొండపూడిలో రోగులకు సురక్ష కిట్ అందజేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

గోపాలపురం: ప్రజల ఆరోగ్యానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బాధ్యతగా అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. శుక్రవారం దొండపూడి సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సురక్ష వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నారని, వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హుకుంపేట, గోపాలపురం, అన్నదేవరపేట వైద్యులు సుమారు 250 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 11 మందికి మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం జీఎస్ఎల్ ఆసుపత్రికి సిఫార్సు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, సర్పంచ్ మల్లిపూడి అచ్చిబాబు, ఎంపీటీసీ సభ్యుడు మారాజు రాజేష్, మండల పార్టీ కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, యండపల్లి కవిత, కాసాని నాని, పోల్నాటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి తరలిరావాలని పిలుపు

కొవ్వూరు: కరోనా నేపథ్యంలో కొవ్వూరు రైల్వే స్టేషన్‌లో పలు రైళ్ల హాల్ట్‌ను నిలిపివేశారు. తిరిగి వాటిని పునరుద్ధరించాలని కోరుతూ 11న ఉదయం పది గంటలకు పట్టణంలో సమావేశం నిర్వహించనున్నారు. రైల్వే స్టేషన్ వద్ద జరిగే సమావేశానికి డివిజన్ పరిధిలోని మేధావులు, వివిధ సంఘాల ప్రతినిధులు, పౌరులు హాజరు కావాలని రైల్వే పరిరక్షణ సమితి నాయకులు కోరారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

చాగల్లు: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తే తప్పనిసరిగా గుర్తింపు లభిస్తుందని చాగల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఇ.తనూజ అన్నారు. పీహెచ్‌సీలో వైద్యురాలు లక్ష్మీప్రియ సర్జరీ విభాగంలో పీజీ సీట్ సాధించి వెళ్తుండడంతో ఆమెను పీహెచ్‌సీ సిబ్బంది శుక్రవారం సత్కరించారు. సీహెచ్ఓ జార్జ్ సుధీర్, పీహెచ్ఎన్ జమీల, హెచ్‌వీ ప్రభావతి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు

చాగల్లు: రోటరీ యువజన మాసోత్సవంలో భాగంగా రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు మిడ్ టౌన్ ఆధ్వర్యంలో చాగల్లు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలను శుక్రవారం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు గుంపుల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. హెచ్ఎం పి.వీర్రాజు, క్లబ్ ట్రెజరర్ తుమ్మెద సత్తిరాజు, ఇంజె శేఖర్, గుబ్బల సత్యప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి పాల్గొన్నారు.

జగనన్న కాలనీలకు కాంతులు

- శరవేగంగా విద్యుత్ లైన్ల నిర్మాణం
- రూ.6.20 కోట్లతో పనులు


దేవరపల్లిలోని జగనన్న లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు

దేవరపల్లి: పేదల సొంతింటి కలను తీర్చేందుకు ప్రభుత్వం అన్ని వసతులూ కల్పిస్తోంది. ఇందులో భాగంగా జగనన్న లేఅవుట్లలో రోడ్ల నిర్మాణం, విద్యుత్, మంచినీటి సదుపాయం వంటి పనులు శరవేగంగా చేపడుతోంది. లేఅవుట్లలో మౌలిక వసతులు కల్పించడంతో లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకుంటున్నారు. దేవరపల్లి మండలంలోని తొమ్మిది జగనన్న లేఅవుట్లలో విద్యుత్ వెలుగులు నింపుతున్నారు. రూ.6.20 కోట్లతో విద్యుత్ లైన్ల పనులు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు. గోపాలపురం నియోజకవర్గంలో అతి పెద్ద లేఅవుట్ దేవరపల్లిలో ఏర్పాటు చేశారు. సుమారు 35 ఎకరాల భూమిని ప్రభుత్వం కొనుగోలు చేసి దాదాపు 1,145 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసింది. వీరందరికీ రెండో విడతలో గృహాలు మంజూరు కావడంతో ప్రస్తుతం సుమారు 200 మంది లబ్ధిదారులు సొంతంగా ఇళ్లు నిర్మించుకుంటున్నారు. గృహ నిర్మాణం చేపట్టిన లేఅవుట్లలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారు. దేవరపల్లి లేఅవుట్‌లో రూ.1.30 కోట్లతో 200 స్తంభాలను ఏర్పాటు చేసి లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం ఏడు 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్టు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. మండలంలో దేవరపల్లి, త్యాజంపూడి, గౌరీపట్నం, సంగాయగూడెం, దుద్దుకూరు, బందపురం గ్రామాల్లోని లేఅవుట్లలో విద్యుత్ లైన్ల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మంచినీటి బోర్లు, పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నారు. మరో నెల రోజుల్లో లేఅవుట్లలో విద్యుత్తు పనులు పూర్తవుతాయని ఎమ్మెల్యే తెలిపారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి


తాడిమళ్లలో ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి తదితరులు

నిడదవోలు రూరల్: రైతులంతా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి గిట్టుబాటు ధర పొందాలని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం తాడిమళ్ల సొసైటీ పరిధిలోని ఆర్‌బీకేల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీపీ భాగ్యలక్ష్మి, సర్పంచ్ బయ్యే రాధారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో రైతుల ఇబ్బందులు పరిష్కరించేందుకు మైత్రీ కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. సొసైటీ అధ్యక్షుడు చింతల సీతారామయ్య, ఉప సర్పంచ్ పెనుగొండ కృష్ణమోహన్, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కటికిరెడ్డి నారాయణరావు, నాయకులు దుర్గారావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాల పరిశీలన

తాళ్లపూడి: మండలంలో ఖరీఫ్ ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి ప్రభుత్వం 13 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిందని మండల వ్యవసాయాధికారి జి.రుచిత తెలిపారు. మండలంలోని రైతు భరోసా కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రైతులు వరి పంటను కోసిన తర్వాత ఆర్‌బీకేల్లో సమాచారం ఇస్తే సిబ్బంది ధాన్యం నమూనాలు తీసుకుని గోనె సంచులు అందిస్తారన్నారు. ధాన్యం కొనుగోలులో ఫిర్యాదులు, సలహాలు ఉంటే తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటైన కంట్రోల్ రూమ్ నంబరు 95029 98197కు చేయాలన్నారు.

పీహెచ్‌సీ వైద్యాధికారికి సత్కారం

నిడదవోలు రూరల్: సమిశ్రగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి జాతీయస్థాయి ఉత్తమ అవార్డు రావడానికి కృషి చేసిన వైద్యాధికారి ఎ.అమరేంద్ర సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ గ్రామ, సొసైటీ అధ్యక్షుడు గజ్జరపు శ్రీరమేష్ అన్నారు. సమిశ్రగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి అమరేంద్ర పీజీ వైద్య కోర్సు చేసేందుకు అర్హత సాధించడంతో ఆరోగ్య సిబ్బంది శుక్రవారం ఆయనను సత్కరించారు. ఎంపీహెచ్ఓ ఎ.రాజమోహన్, పీహెచ్‌సీ సిబ్బంది, ఎంఎల్ఎఫ్‌లు, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అచీవ్‌మెంట్ సర్వే పరిశీలన


నల్లజర్లలో పరీక్ష తీరును పరిశీలిస్తున్న ఎంఈఓలు సత్యనారాయణ, భగవతి

నల్లజర్ల: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను అంచనా వేసేందుకు స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వేకు మండలంలో 31 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 1,291 మంది విద్యార్థులు హాజరైనట్టు ఎంఈఓలు వై.సత్యనారాయణ, కె.భగవతి తెలిపారు. 200 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదన్నారు. నల్లజర్ల–1, మెయిన్, దూబచర్ల జెడ్పీ హైస్కూల్, ఎలైట్ పాఠశాలల్లో ఈ పరీక్షల తీరును వారు పర్యవేక్షించారు. 3, 6 తరగతుల విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిషు, గణితం, పరిసరాల విజ్ఞానం, 9వ తరగతి విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిషు, గణితం, సోషల్, సైన్స్ సబ్జెక్టులలో పరీక్ష నిర్వహించారు.

తాళ్లపూడి: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న 3, 6, 9 తరగతుల విద్యార్థులకు సీస్ పరీక్ష నిర్వహించారు. మొత్తం 812 మంది విద్యార్థులు ఓఎమ్మార్ షీట్‌లలో జవాబులు రాశారు. ఎంఈఓలు సీహెచ్ బాలామణి, సీహెచ్ నెహ్రూజీ పరీక్షలు జరుగుతున్న అన్ని పాఠశాలలను పరిశీలించారు.